యాదగిరిగుట్టలో శాస్త్రోక్తంగా నిత్యోత్సవాలు

యాదగిరిగుట్ట, ఆగస్టు 16 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారికి నిత్యోత్సవాలు శాస్త్రోక్తంగా జరిగాయి. శుక్రవారం తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయం ముఖ మండపంలో స్వామివారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా భక్తులతో సువర్ణ పుష్పార్చన జరిపించారు. బంగారు పుష్పాలతో దేవేరులకు అర్చన చేశారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి సేవ, దర్బార్ సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవను జరిపారు. సాయంత్రం ప్రధానాయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారిని పట్టువస్త్రాలు, బంగారు ముత్యాలు, వజ్రాభరణాలతో దివ్య మనోహరంగా అలకంరించి తిరువీధుల్లో ఊరేగించారు. అద్దాల మండపంలో వేదమంత్ర పఠనాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆస్థాన విధ్యాంసుల మంగళ వాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నీరాజనాల నడుమ ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. రాత్రి స్వామివారికి తిరువారాధన, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన జరిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. అనుబంధ పర్వతవర్ధనీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో నిత్య పూజలు స్మార్తగమశాస్త్రరీతిలో జరిగాయి. భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. సుమారు 18వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. స్వామివారి ఖజానాకు రూ.33,07,813 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

లోఓల్టేజీ సమస్యను పరిష్కరించి నిరంతర విద్యుత్ ఇవ్వాలి

- విద్యుత్ అధికారులను కోరిన రైతులు



రైతుల సమావేశంలో మాట్లాడుతున్న ట్రాన్స్‌కో ఏఈ ప్రభాకర్‌రెడ్డి

ఆత్మకూరు(ఎం), ఆగస్టు 16 : లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించి నాణ్యమైన నిరంతర విద్యుత్ ఇవ్వాలని రైతులు సంబంధిత అధికారులను కోరారు. విద్యుత్ సరఫరాపై ట్రాన్స్‌కో సీఎండీ ముషారఫ్ ఫారుఖ్ ఆదేశాల మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ వద్ద రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ లోఓల్టేజీతో మోటార్లు కాలిపోతున్నాయన్నారు. విద్యుత్ ప్రమాదాలను అరికట్టడంతోపాటు ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని కోరారు.

పొలాల మధ్య నుంచి ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలపై లూజ్ వైర్లను సరిచేయాలన్నారు. సమావేశంలో ట్రాన్స్‌కో ఏఈ ప్రభాకర్‌రెడ్డి, రైతులు ట్రాన్స్‌కో ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా : మున్సిపల్ చైర్మన్ రాజు

నీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజు

చౌటుప్పల్, ఆగస్టు 16 : పట్టణాభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు అన్నారు. పట్టణంలోని సీతారామ చంద్ర స్వామి దేవాలయంలో శుక్రవారం నీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డుల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, దేవాలయ చైర్మన్ బొబ్బిళ్ల మురళి, కామిశెట్టి చంద్రశేఖర్, పోలోజు శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నీటి నిల్వలను పరిశీలిస్తున్న వైద్యాధికారులు

చౌటుప్పల్, ఆగస్టు 16 : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వ్యాధి నిరోధక టీకాల జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ రామకృష్ణ అన్నారు. డ్రైడే డ్రై డే కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామంలో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి పరసరాల్లో నీటి నిల్వలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి కాటం రాజు, హెచ్‌ఈఓలు మధు, ఇస్తారి, సాయి రెడ్డి, వెంకటేశ్వర్లు, వేణుగోపాల్, సరళ పాల్గొన్నారు.

రెండు కిలోల గంజాయి పట్టివేత

రామన్నపేట, ఆగస్ట్ 16 : భద్రాచలం నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న రెండు కిలోల గంజాయిని జిల్లా టాస్క్‌ఫోర్స్, రామన్నపేట ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం రాత్రి పట్టుకున్నారు. భద్రాచలం నుంచి కారులో హైదరాబాద్‌కు గంజాయిని తరలిస్తున్నట్లు అధికారులకు విశ్వసనీయ సమాచారం అందింది. అప్పటికే ఇల్లెందు, ఖమ్మం, తుంగతుర్తి, నకిరేకల్ సెంటర్ల నుంచి తప్పించుకొని యాదాద్రి జిల్లాలోకి ప్రవేశించినట్లు తెలుసుకొని టాస్క్‌ఫోర్స్, ఎక్సైజ్ అధికారులు అప్రమత్తమై పలు మార్గాల్లో నిఘా పెట్టారు. చౌటుప్పల్ మండలం తుప్రాన్‌పేట వద్ద కారును అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా.. రెండు కిలోల గంజాయి దొరికింది. కారును, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. తనిఖీల్లో ట్రాస్క్‌ఫోర్స్ సీఐ రాధాకృష్ణ, ఎక్సైజ్ సీఐ బాలోజీనాయక్, ఎస్ఐ శంకర్ పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమ నాయకులను బేషరతుగా విడుదల చేయాలి

సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ప్రగతిశీల యువజన సంఘం నాయకులు

భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 16 : ప్రజా ఉద్యమ నాయకులపై అత్యుత్సాహం ప్రదర్శించి అమానుషంగా దాడి చేసిన ఇల్లెందు సీఐ సత్యనారాయణను సస్పెండ్ చేయాలని, అక్రమంగా అరెస్టు చేసిన ప్రజా నాయకులను బేషరతుగా విడుదల చేయాలని ప్రగతిశీల యువజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. నాయకుల అక్రమ అరెస్టులను నిరసిస్తూ శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ప్రగతిశీల యువజన సంఘం పట్టణ కార్యదర్శి పగడాల శివ మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు నీటిని భద్రాది కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల ఏజెన్సీ ప్రాంతాలకు ఇవ్వాలన్నారు. ఏజెన్సీ రైతుల సమస్యలను పరిష్కరించాలని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇల్లెందు పట్టణంలో శాంతియుతంగా నిరసన ప్రదర్శన చేస్తున్న సీపీఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ ప్రగతిశీల యువజన సంఘం నాయకుల అరెస్టులను తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశంగా, అప్రజాస్వామికంగా వ్యవహరిస్తే ప్రజలే తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. సంఘం పట్టణ నాయకులు పోతగళ్ల నర్సింహ, లక్ష్మీనారాయణ, మున్నా ప్రవీణ్, యాదయ్య పాల్గొన్నారు.

వైభవంగా వరలక్ష్మీ వ్రతాలు

భూదాన్ పోచంపల్లి : లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో సామూహిక వ్రతాల్లో మహిళలు

భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 16 : శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని మండలంలో మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మార్కండేశ్వర స్వామి దేవాలయంలో శంకర మహిళా భజన మండలి, లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో లక్ష్మీనారాయణ స్వామి భజన మండలి ఆధ్వర్యంలో వ్రతాలు ఆచరించారు. ఆలయంలో సుప్రభాతం, స్వామివారికి అష్టోత్తర శతనామావళి, వరలక్ష్మీ వ్రత పూజ, అన్నదానం, మంగళ హారతి, మంత్ర పుష్పం వంటి పూజా కార్యక్రమాలు చేశారు. కార్యక్రమంలో మార్కండేశ్వర దేవాలయ చైర్మన్ సీత సత్యనారాయణ, లక్ష్మీనారాయణ ఆలయ చైర్మన్ అంకం వినోద్, నాయకులు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

భువనగిరి అర్బన్ : పట్టణంలోని కన్యకాపరమేశ్వరి, సాయిబాబా దేవాలయంలో వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన చేశారు. దేవతలకు నైవేద్య, ప్రసాదాలు పెట్టి మహిళలు ఒకరికొకరు వాయినాలు ఇచ్చుకున్నారు. 23వ వార్డు కౌన్సిలర్ పడిగెల రేణుక, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చౌటుప్పల్ : పట్టణంలోని సీతారామ చంద్ర స్వామి దేవాలయంలో మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు చేశారు. దేవాలయ అర్చకులు పెద్ది సుధాకర్ శర్మ వేదమంత్రోచ్చరణలతో వ్రతాన్ని చేశారు. అనంతరం మహిళలు పూజలు చేసి ఒకరికొకరు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు.

చౌటుప్పల్ రూరల్ : మండలంలోని పలు గ్రామాల ఆలయాల్లో మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

రామన్నపేట : మండల వ్యాప్తంగా వరలక్ష్మీ వ్రతాలు జరిగాయి. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమ, గంధం, గాజులు సమర్పించారు.

భువనగిరి అర్బన్ : వరలక్ష్మీ వ్రత పూజల్లో పాల్గొన్న మహిళలు

చౌటుప్పల్ : సీతారామచంద్ర స్వామి దేవాలయంలో..

చౌటుప్పల్ రూరల్ : మార్కండేయస్వామి దేవాలయంలో వరలక్ష్మీ పూజలు చేస్తున్న మహిళలు

రామన్నపేట : వెల్లంకి శివాలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఆచరిస్తున్న మహిళలు

మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత జన్మదిన వేడుకలు

యాదగిరిగుట్టలో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సునీత, మహేందర్‌రెడ్డి దంపతులు

యాదగిరిగుట్ట/ బొమ్మలరామారం/ తుర్కపల్లి/ ఆత్మకూరు(ఎం)/ ఆలేరు రూరల్/ మోటకొండూర్/ రాజాపేట, ఆగస్టు 16 : మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆయా మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, శ్రేణులు కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. యాదగిరిగుట్టలోని గొంగిడి సునీత నిలయంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. గొంగిడి సునీత, మహేందర్‌రెడ్డి దంపతులు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కొండ కింద వైకుంఠ ద్వారం వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆలేరు పట్టణంలోని ఇమ్మడి నర్సింహారెడ్డి గార్డెన్‌లో నిర్వహించిన బ్లడ్ క్యాంపును ప్రారంభించారు. ఆలేరు ప్రభుత్వ దవాఖానలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఎగ్గిడి కృష్ణ ఆధ్వర్యంలో సునీత జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సూదగాని హరిశంకర్‌గౌడ్, మదర్ డెయిరీ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకర్, బీఆర్ఎస్ పార్టీ ఆయా మండలాల అధ్యక్షులు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. బొమ్మలరామారం, తుర్కపల్లి మండల మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆలేరులో బీఆర్ఎస్ నాయకులు నిర్వహించిన జన్మదిన వేడులకు గొంగిడి సునీత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలేరులోని డయాలసిస్ సెంటర్‌లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మోటకొండూర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బొట్ల యాదయ్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, సూదగాని ఫౌండేషన్ చైర్మన్ సూదగాని హరిశంకర్‌గౌడ్ ఆలేరులో సునీతకు పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రాజాపేట మండల కేంద్రంలో కేక్ కట్ చేసి దవాఖానలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

18న పాపన్నగౌడ్ జయంతి వేడుకలు : కలెక్టర్

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 16 : కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఈ నెల 18న ఉదయం 10:30 గంటలకు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 374వ జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు కలెక్టర్ హనుమంతు కె.జెండగే శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాపన్నగౌడ్ జయంతి కార్యక్రమానికి బీసీ కుల సంఘం నాయకులు, ప్రజలు, అధికారులు హాజరు కావాలని సూచించారు.

ఫారెస్ట్ భూముల్లో బోర్లు వేస్తే కేసులు

సంస్థాన్ నారాయణపురం, ఆగస్టు 15 : రాచకొండ ప్రాంతంలోని ఫారెస్టు భూముల్లో ఎవరైనా బోర్లు వేసినా, జేసీబీతో భూములు చదును చేసినా అటవీ చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తామని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ శంకర్‌నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అటవీ చట్టాలను గౌరవించాలని, ఫారెస్ట్ అధికారులకు సహకరించాలని ప్రజలకు సూచించారు.

'పాపన్నగౌడ్ జయంతిని విజయవంతం చేయాలి'

రవికుమార్‌గౌడ్

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 16 : పట్టణంలోని ఖిలా వద్ద ఈ నెల 18న నిర్వహించే బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374వ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని పాపన్నగౌడ్ సేన జాతీయ యువజన అధ్యక్షుడు పరిటాల రవికుమార్‌గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బహుజనులకు రాజ్యాధికారం కట్టబెట్టాలనే అకుంఠిత దీక్షతో సొంతంగా సైన్యాన్ని సమకూర్చుకుని ఎన్నో కోటలను జయించిన సార్వభౌముడు పాపన్నగౌడ్ అని కొనియాడారు. పాపన్నగౌడ్ జీవిత చరిత్ర నేటి యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. జయంతి వేడుకలకు రాష్ట్రం నలుమూలల నుంచి బహుజనులు తరలి రావాలని కోరారు.

నేరాల నియంత్రణలో భాగస్వాములు కావాలి

నేరాల నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 16 : గ్రామాల్లో రోజురోజుకూ పెరిగిపోతున్న నేరాల నియంత్రణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని రూరల్ పోలీసులు అన్నారు. పట్టణంలోని రాయగిరిలో నేరాల నియంత్రణపై శుక్రవారం ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు కలిపించినా, గుర్తు తెలియని వాహనాలు తచ్చాడినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిసలు కావద్దని, మత్తు పదార్థాలకు అలవాటు జీవితాలను ఆగం చేసుకోవద్దని సూచించారు. గ్రామాల్లో మత్తు పదార్థాలు కనిపిస్తే 100కు ఫోన్ చేయాలని, యువత రాత్రి సమయాల్లో గస్తీ చేపట్టాలని పేర్కొన్నారు.

శంకరయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

వలిగొండ, ఆగస్టు 16 : వలిగొండ గ్రామ పంచాయతీలో 35 ఏండ్లుగా వాటర్ మెన్‌గా పనిచేస్తున్న నల్లాల శంకరయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. శుక్రవారం గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పైళ్ల గణపతిరెడ్డి గ్రామ పంచాయతీ వర్కర్స్‌తో కలిసి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంకరయ్య కుటుంబానికి రూ.5లక్షల ఇన్సూరెన్స్ మంజూరు చేయాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 35 సంవత్సరాలుగా చేసిన సేవలను గుర్తించి గ్రామ పంచాయతీ నుంచి రూ.50వేలు ఇవ్వాలని కోరారు.

కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు బందెల భిక్షం, నాయకులు ఎడవెల్లి ఎల్లయ్య, ఎడవెల్లి శ్రీరాములు, మల్లయ్య, రామలింగం, సాలయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.

నేతాజీ యువజన సంఘం అధ్యక్షుడిగా రమేశ్‌గౌడ్

రమేశ్‌గౌడ్

భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 16 : పట్టణంలోని నేతాజీ యువజన సంఘం అధ్యక్షుడిగా గునిగంటి రమేశ్‌గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం భవనంలో గౌరవ సభ్యులు కుడికాల బాలనర్సింహ, బోడ సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్నికలు నిర్వహించారు. ఉపాధ్యక్షులుగా డబ్బికార్ సాహేశ్, వేముల పాండు, కుడికాల రామనర్సింహ, ప్రధాన కార్యదర్శిగా శెట్టి శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా చెరుకు ఆనంద్, వంగూరి పాండు, ముప్పిడి శ్రీనివాస్, గునిగంటి వెంకటేశం, చెరుకు నవీన్ గౌడ్, సాంస్కృతిక కార్యదర్శిగా కీర్తి సంజీవ, సహాయ కార్యదర్శిగా తన్నీరు ధీరజ్, కుడికాల శ్రీను, పండుగ సోను, క్రీడల కార్యదర్శిగా శెట్టి నాగరాజు, మసనం ప్రసాద్, కొండ భాస్కర్, కార్యవర్గ సభ్యులుగా కీర్తి శేఖర్, సబ్బుగాని శంకర్, గంగదారి విజయ్, వంగూరి శ్రవణ్, శెట్టి మణిశంకర్ ఎన్నికయ్యారు.

మహిళా సాధికారతకు సర్కారు కృషి

- ప్రభుత్వ విప్ ఐలయ్య, ఎంపీ చామల, మహిళా అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ శోభారాణి

కుట్టు శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ శోభారాణి

ఆలేరు రూరల్, ఆగస్టు 16 : మహిళా సాధికారత సాధించినప్పుడే సమాజంలో నిజమైన అభివృద్ధి జరుగుతుందని, మహిళల ఆర్థికాభివృద్ధికి సర్కారు కృషి చేస్తున్నదని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ బంద్రు శోభారాణి అన్నారు. ఆలేరు పట్టణంలో మదర్ ఎడ్యుకేషన్ రూరల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ పొందిన మహిళలకు శుక్రవారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఉంటే వాళ్ల పిల్లలను గొప్పగా చదివించి కుటుంబానికి ఆసరాగా ఉంటారన్నారు. అందుకే ప్రభుత్వం మహిళలకు మహాలక్ష్మి, గృహలక్ష్మి వంటి పథకాలను అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వం మహిళలకు వివిధ వృత్తి, విద్య, నైపుణ్య కోర్సుల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని తెలిపారు. మహిళా సహకార అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 25 రంగాల్లో మహిళలకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం మదర్ ఎడ్యుకేషన్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ బాధ్యులు సంధ్యారెడ్డిని అభినందించారు.

ఆలేరు రెవెన్యూ డివిజన్‌కు కృషి చేయాలని వినతి

ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఐలయ్యకు వినతిపత్రం ఇస్తున్న అఖిలపక్ష కమిటీ నాయకులు

ఆలేరు రూరల్, ఆగస్టు 16 : ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు సహకరించాలని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యను అఖిలపక్షం నాయకులు కోరారు. ఈ మేరకు ఆలేరులో ఆదివారం వారికి వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా ఆలేరులో ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలుపాలని కోరారు. కార్యక్రమంలో అఖిలపక్ష కమిటీ కన్వీనర్ పసుపునూరి వీరేశం, నాయకులు రాచకొండ జనార్దన్, మొరిగాడి శేఖర్, ఎండీ సలీమ్, కామిడికాలి అశోక్, చెక్క వెంకటేశ్, సముద్రాల సత్యం, కెమిడి ఉప్పలయ్య, కల్లెపు అడివయ్య పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలుపై పోరాడాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

ఆలేరు రూరల్, ఆగస్టు 16 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు, ప్రజా సంక్షేమ పథకాల అమలుపై ప్రజల పక్షాన పోరాడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆలేరు పట్టణంలో శుక్రవారం నిర్వహించిన సీపీఐ జిల్లా కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధులు ఆరుట్ల రామచంద్రారెడ్డి, కమలాదేవి ఈ ప్రాంత సమస్యలపై అనేక ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించారన్నారు. వారి స్ఫూర్తితో పేదలకు ఇండ్ల నిర్మాణం, పెన్షన్లు, సంక్షేమ పథకాల అమలుపై ఉద్యమం కొనసాగించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, వ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు చెక్క వెంకటేశ్, దామోదర్‌రెడ్డి, సత్యనారాయణ, రాజయ్య, జంగమ్మ, అశోక్, సుదర్శన్ పాల్గొన్నారు.

బునాదిగాని కాల్వ పూర్తి చేసి గోదావరి జలాలు అందించాలి

- సీపీఎం జిల్లా నాయకుడు కల్లూరి మల్లేశం

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కల్లూరి మల్లేశం

మోత్కూరు, ఆగస్టు 81 : బునాదిగాని కాల్వ పనులు పూర్తి చేసి గోదావరి జలాలు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కల్లూరి మల్లేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు అధ్యక్షతన శుక్రవారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీబీనగర్ మండలం మక్తానంతారం నుంచి మొదలైన బునాదిగాని కాల్వ ధర్మారం వరకు దాదాపు 98 కిలోమీటర్లు ఉన్నదన్నారు. ఇప్పటివరకు 54 కిలోమీటర్లు పూర్తయిందని, ఇంకా 44 కిలోమీటర్లు పూర్తి కావాల్సి ఉందని తెలిపారు. 448 ఎకరాల భూసేకరణకు గానూ ఇంకా 106 ఎకరాలు సేకరణ చేయాల్సి ఉందన్నారు. కాల్వను త్వరగా పూర్తి చేసి బస్వాపురం ప్రాజెక్టు ద్వారా అనుసంధానం చేసి గోదావరి నీటిని అందించాలని కోరారు. కాల్వ సాధన కోసం వచ్చే నెల మొదటి వారంలో ధర్మారం నుంచి కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొల్లు యాదగిరి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పొన్నబోయిన రమేశ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అవిశెట్టి ఐలమల్లు, రైతు సంఘం నాయకులు పైళ్ల యాదిరెడ్డి, పట్టణ కార్యదర్శి కూరపాటి రాములు, దడిపల్లి ప్రభాకర్, మెతుకు అంజయ్య, పిట్టల చంద్రయ్య, పైళ్ల రామిరెడ్డి, కొంపల్లి గంగయ్య, కందుకూరి నర్సింహ పాల్గొన్నారు

మంద కృష్ణను కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆత్మకూరు(ఎం) : మందకృష్ణ మాదిగను క